సొంతింటి కలకు బూజు.!

- కూటమి ప్రభుత్వంలో ఇళ్ల మంజూరు శూన్యం
- మంత్రాలయం సబ్ డివిజన్‌లో 8,105 దరఖాస్తులు
- లబ్ధిదారులకు తప్పని ఎదురు చూపులు



చిరుతపల్లిలో డబ్బు లేక మధ్యలోనే ఆగిపోయిన ఇంటి నిర్మాణం



వైఎస్సార్‌సీపీ హయాంలో మంత్రాలయం జగనన్న కాలనీలో నిర్మించిన ఇళ్లు

మంత్రాలయం : సొంతింటి కళ కలగానే మిగిలింది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక ఒక్క గూటికి కూడా మోక్షం లేకపోయింది. ఇంటి దరఖాస్తులకు బూజు పట్టింది. ఇంటి మంజూరు కోసం అభ్యర్థులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఏడాదిన్నరగా కూటమి ప్రభుత్వం చేస్తున్న కాలయాపనపై మండిపడుతున్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేయాలని అర్థిస్తున్నారు.

పెండింగ్‌లో 8,105 దరఖాస్తులు

మంత్రాలయం నియోజకవర్గంలో మొత్తం 94 పంచాయతీలు ఉన్నాయి. దాదాపు 3,09,176 జనాభా ఉంది. వెనకబడిన ప్రాంతం కావడంతో ప్రభుత్వం ఇచ్చే సొమ్ముతో పాటు వలస వెళ్లి పోగు చేసుకున్న డబ్బుతోనే ఇంటి నిర్మాణాలు చేసుకుంటున్నారు. ప్రభుత్వ హౌసింగ్ శాఖపైనే ఇక్కడ ఎక్కువగా ఆధారపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా ఒక్క ఇంటిని మంజూరు చేయలేదు. దరఖాస్తులకే పరిమితం కావడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో మొత్తం 8,105 మంది హౌసింగ్ కోసం దరఖాస్తు పెట్టుకున్నారు. అందులో మంత్రాలయంలో 1,085, పెద్దకడబూరులో 1,669, కోసిగిలో 3,224, కౌతాళంలో 2,123 మంది దరఖాస్తు చేసుకున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో...:

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పేదల ఇంటి కలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. ఊళ్లను తలపించేలా జగనన్న కాలనీలు రూపుదిద్దుకున్నాయి. అంతేగాక దరఖాస్తు పెట్టుకున్న ప్రతి ఒక్కరికీ ఇండ్లు మంజూరు చేశారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇంటి నిర్మాణాలు చేపట్టారు. మంత్రాలయం నియోజకవర్గంలో 6,951 మందికి ఇళ్లను మంజూరు చేయగా ఇప్పటి వరకు 3,729 ఇంటి నిర్మాణాలు పూర్తయ్యాయి. కాగా ఆదోని సబ్ డివిజన్‌లో ఆదోని మండలంలో 1,510 గానూ 620, ఆదోని పట్టణంలో 5,189 రాగా 3,195 గృహాలు నిర్మించుకున్నారు. ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో ఎమ్మిగనూరు మండలంలో 1,451కు గానూ 925, ఎమ్మిగనూరు పట్టణంలో 1,330 రాగా 1,288, నందవరంలో 409కి గానూ 230, గోనెగండ్లలో 1,176 రాగా 465, ఆలూరులోని హొళగుందలో 680కి గానూ 277 మంది ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లో మొత్తం 18,696 మందికి ఇళ్ల మంజూరు చేయగా 10,729 మంది సొంతిల్లు కట్టుకున్నారు.

ఎదురు చూపులకు ఏడాదిన్నర

సొంతింటి కల ఎదురు చూపులకు ఏడాదిన్నర పూర్తయ్యింది. ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల కళ్లు కాయలయ్యాయి. కూటమి ప్రభుత్వం అభ్యర్థులకు రిక్త హస్తం చూపడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పేదల గూటి విషయంలో కూటమి ప్రభుత్వ తీరుపై సర్వత్రా మండిపడుతున్నారు. ఇలాంటి ప్రభుత్వాలను ఇంతకు మునుపు చూడలేదని వాపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వం పేదలపై కరుణ చూపాలని కోరుతున్నారు.

ఇంటి కోసం ఎదురు చూస్తున్నాం

మాకు సొంతిళ్లు లేదు. మేము ఉమ్మడి కుటుంబంలోనే కాపురాలు వెల్లదీస్తున్నాం. మా కుటుంబానికి సొంతిల్లు ఆవశ్యకమైంది. హౌసింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నా. ఇప్పటి వరకు మంజూరు కాకపోయింది. ప్రభుత్వం తమకు ఇంటిని మంజూరు చేస్తే బాగుండు. **– విజయ్, కోసిగి**

గుడిసెలోనే కాపురం



నిరుపేదలం. కూలి పనులకు వెళితేనే పూట గడుస్తుంది. మేము కొన్నేళ్లుగా గుడిసెలోనే కాపురం ఉంటున్నాం. సొంత స్థలంలో సొంత డబ్బులతో బేస్‌మట్టం వరకు ఇల్లు నిర్మించుకున్నాం. హౌసింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఏడాది గడిచినా తమకు ఇల్లు మంజూరు కాలేదు. దీంతో డబ్బు లేక ఇంటి నిర్మాణం మధ్యలోనే ఆపేశాం. **– లక్ష్మి, అర్లబండ**

క్లుప్తంగా

దిబ్బనకల్ గ్రామ పంచాయతీ తనిఖీ



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి

ఆదోని రూరల్: మండలంలోని దిబ్బనకల్ గ్రామ పంచాయతీని జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి తనిఖీ చేశారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌పై శానిటేషన్ డోర్ టూ డోర్ కలెక్షన్ మరియు తాగునీటిపై ఆకస్మిక తనిఖీ చేశారు. డోర్ టూ డోర్ కలెక్షన్ చేయాలని పంచాయతీ కార్యదర్శి బాబును ఆదేశించారు. ప్రతి 15 రోజులకొకసారి వాటర్ ట్యాంకును శుభ్రం చేయాలన్నారు. అదేవిధంగా గ్రామంలో ఉన్న డ్రెయినేజీలను శుభ్రం చేయించాలన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు



జేసీబీతో గుంతలను పూడుస్తున్న దృశ్యం

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీలోకి ప్రవేశించే మార్గం నుంచి ఆర్అండ్‌బీ మెయిన్ రోడ్డు వరకు గుంతలు పడ్డ రహదారికి మరమ్మతు పనులను బుధవారం చేపట్టారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు అధికారులతో కలిసి పనులను నిర్వహించారు. రిలయన్స్ ట్రెండ్స్ వద్ద రోడ్డుపై పడిన గుంతలను పూడ్చి గ్రావెల్ వేసి చదును చేశారు. ఎన్‌జీవోస్, ఎల్ఐజీ, ఎంఐజీ, కునిముల్లా తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



కనకవీడులో చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీఓ తిమ్మక్క

నందవరం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌పీఓ తిమ్మక్క సూచించారు. బుధవారం మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో మహిళలకు చెత్త సేకరణ, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. ఇంట్లో చెత్తను బహిరంగా వేయకుడదని, చెత్త బండిలోనే వేయాలని సూచించారు. తడి, పొడి చెత్తలనే వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందిచాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సందీప్, పంచాయతీ కార్యదర్శి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పట్టణ పరిశుభ్రత



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిషనర్, అధికారులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ పరిశుభ్రలో పట్టణ వాసుల భాగస్వామ్యం అవసరమని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. భారత ప్రభుత్వ పిలుపు మేరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛోత్సవ్ కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందన్నారు. మార్కెట్లు, పాఠశాలలు, దేవాలయాలు, పార్కులు, కాలనీలు, రోడ్లలో పరిశుభ్రతపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈలు నీరజ, రాజునాయక్, టీపీఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్‌చోరీ ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం

ఎమ్మిగనూరుటౌన్: ఓట్ చోరీ ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఖాశింవలి ఆరోపించారు. బుధవారం పట్టణంలోని మైనారిటీ కాలనీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓట్‌చోరీపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆసిఫ్, షబ్బీర్, రఫీక్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి, ఉల్లి పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: రైతులు పండించిన పత్తి, ఉల్లి పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకుడు హనుమంతులు డిమాండ్ చేశారు. బుధవారం ఏఐకెఎంఎస్ నాయకులు స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో కార్యదర్శి చంద్రమౌళికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్లా, రాఘవరెడ్డి, బడేసావలి తదితరులు పాల్గొన్నారు.

రేపు 'చలో ఆదోని మెడికల్ కాలేజ్'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నజీర్‌అహమ్మద్

ఎమ్మిగనూరుటౌన్: ఆదోని మెడికల్ కళాశాలను కూటమి ప్రభుత్వం పీపీపీ విధానం పేరుతో ప్రైవేటుకు కట్టబెట్టడాన్ని నిరసిస్తూ ఈనెల 19న వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో చలో ఆదోని మెడికల్ కళాశాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు నజీర్ అహమ్మద్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులో తెచ్చి వారిని వైద్యులుగా చేయాలన్న సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేశారన్నారు. అందులో 7 కళాశాలలు పూర్తి చేసి వైద్య విద్య అందుబాటులో తీసుకొనిరాగా, మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయన్నారు. 10 కళాశాలల్లో ఆదోని సమీపంలో మెడికల్ కళాశాల నిర్మాణం 60శాతం పూర్తయిందని, దానిని ప్రైవేట్‌కు అప్పగిస్తూ రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకుందన్నారు. దీనిని నిరసిస్తూ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్ పిలుపు మేరకు ఈనెల 19న నిర్వహించే చలో ఆదోని మెడికల్ కాలేజీ కార్యక్రమానికి యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. మెడికల్ కళాశాలను ప్రైవేట్‌కు అప్పగించే నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల, పట్టణ అధ్యక్షులు బనవాసి బసిరెడ్డి, బోయరాజు, నందవరం, గోనెగండ్ల మండలాల అధ్యక్షులు వెంకటేష్, జహంగీర్, విద్యార్థి విభాగ అధ్యక్షుడు సోమేష్, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ మహర్షి జయంతి వేడుకలను జరుపుకుంటున్న దృశ్యం

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని కాళికాదేవి ఆలయ ఆవరణంలో వేదమాత గాయత్రీదేవి విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీదేవశిల్పి విశ్వకర్మ మహర్షి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఆయన చిత్రపటాన్ని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. మహా మంగళహారతుల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నరసింహాచారి, విశ్వబ్రాహ్మణులు కేశవాచారి, శరవయ్యాచారి, హరికృష్ణాచారి, ఈరన్నాచారి, వీరప్పాచారి తదితరులు పాల్గొన్నారు.



విశ్వబ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షుడిని సత్కరిస్తున్న సంఘ నాయకులు

- **ఎమ్మిగనూరుటౌన్:** స్థానిక ఆదోని రోడ్డులో వెలసిన కాళికాదేవి ఆలయ స్థల ఆవరణలో బుధవారం విశ్వకర్మ భగవాన్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రత్యేక పూజలతో హోమం చేపట్టారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య, గౌరవాధ్యక్షుడు గువ్వలదొడ్డి శ్రీనివాసులు, వీరభద్ర ఆచారి, రవికుమార్‌ల ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ సేవా సంఘ నూతన కమిటీ అధ్యక్షుడిగా జాలవాడి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా సూర్యనారాయణ ఆచారి, ప్రధాన కార్యదర్శులుగా సురేష్, లక్ష్మినారాయణ, రమేష్, కోశాధికారులుగా గోరంట్ల ఉరుకుందులను ఎన్నుకున్నారు.

వైద్య కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలి



నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల వద్ద మాట్లాడుతున్న పీడీఎస్ఓ రాష్ట్ర నాయకులు తిరుమలేష్

ఆదోని రూరల్: ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని, పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని పీడీఎస్ఓ రాష్ట్ర నాయకులు తిరుమలేష్, డీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ధణాపురం ఉదయ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఆరేకల్ సమీపంలోని మెడికల్ కళాశాలను సందర్శించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు సరైన వైద్యం, విద్యార్థులకు సరైన విద్య అందుతుందనే ఉద్దేశ్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మెడికల్ వైద్య కళాశాల నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యార్థులకు, ప్రజలకు అన్యాయం చేస్తూ పీపీపీ పద్ధతిలో కొనసాగిస్తామని కేబినెట్ మీటింగ్‌లో నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. కార్యక్రమంలో పీడీఎస్ఓ డివిజన్ కార్యదర్శి శివ, పట్టణ కార్యదర్శి రాజేష్, డీఎస్ఎఫ్ ముఖ్య నాయకులు వినోద్, నరసింహులు, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ తగదు

ఆదోని సెంట్రల్: అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం తగదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప ఉపాధ్యక్షులు శ్రీనివాసులు పట్టణ కార్యదర్శి శశిధర్ అన్నారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు భిక్షాటన చేస్తూ.. అర్ధనగ్నంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం 60 శాతం నిర్మాణాలు పూర్తి చేసిందని, ఇంకా నలభై శాతం పనులను చేపడితే భవనాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రభుత్వ ధనంతో నిర్మించిన కళాశాలను ప్రైవేటీకరణ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

ఆదోని రూరల్: ఆదోని ఎంపీడీఓ కార్యాలయం బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా పడింది. సమావేశానికి ఎంపీపీ దానమ్మ అధ్యక్షత వహించగా.. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఎంపీడీఓ జనార్ధన్ హాజరయ్యారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎంపీటీసీల రాక కోసం వేచి చూడగా సంతెకూడ్లూరుకు చెందిన ఎంపీటీసీ కమలమ్మ, మండల కోఆప్షన్ మెంబర్ వాదిరాజ్, జిల్లా కోఆప్షన్ మెంబర్ అస్లాంభాద్రి మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరం లేక ఎంపీపీ దానమ్మ నిర్ణయం మేరకు సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ ప్రకటించారు.

అంబేడ్కర్ భవన్‌కు స్థలం కేటాయించాలి

మంత్రాలయం రూరల్ : మంత్రాలయంలో అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని దళిత బహుజన సంఘాల నేతృత్వంలో వినతిని అందజేశారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి ర్యాలీగా బయలుదేరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ అంబేడ్కర్ భవన్‌కు రెండు ఎకరాల భూమి కేటాయించాలని కోరారు. ఆందోళనలో నాయకులు రామతీర్థం, అమరేష్, గడ్డం నాగేంద్ర, సుందరరాజు, కయ్యోన్, ఆదాము, చార్లెస్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత

ఆదోని సెంట్రల్: పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యాబోధన కుంటు పడుతోందని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షులు నాగరాజు, రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్ తెలిపారు. నెహ్రూమెమోరియల్, పురపాలక ఉన్నత పాఠశాలలో బుధవారం ఎస్టీయూ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ బదిలీలు అయిన ఉపాధ్యాయులు రిలీవర్ లేక చాల మంది పాత పాఠశాలల్లోనే కొనసాగుతున్నారన్నారు. దీంతో ఆయా పాఠశాలల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రమేష్ నాయుడు, రవి, భీమరాజు, లోక్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీపై ముగిసిన వర్క్‌షాప్

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీలో సీఎస్ఈ, సీఎస్‌డీ విభాగం వారి ఆధ్వర్యంలో డ్రోన్ టెక్నాలజీపై జరిగిన మూడు రోజుల వర్క్‌షాప్ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. సుధాకర్ మాట్లాడుతూ ఈ శిక్షణ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంలో నూతన ధోరణులను అర్థం చేసుకొని తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవటానికి దోహద పడుతుందని చెప్పారు. రిసోర్స్ పర్సన్ ముకేష్, సీఎస్ఈ హెచ్ఓడీ డా. వీరేష్ పాల్గొన్నారు.

పోషకాహారం ఎంతో అవసరం



ఎమ్మిగనూరులో గర్భిణులకు పోషకాహారం అందజేస్తున్న సూపర్‌వైజర్లు నీలమ్మ, ప్రీతి

మంత్రాలయం రూరల్ : ఆరోగ్యకరమైన శిశువు జన్మించాలంటే గర్భిణులు కచ్చితంగా పోషకాలు కల్గిన ఆహారం తీసుకోవాలని సీడీపీఓ రాజేశ్వరిదేవి సూచించారు. బుధవారం మండలంలోని సూగూరు గ్రామంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గర్భిణులకు పాలు, ఫలాలు, పోషకాలు కల్గిన ఆహార పదార్థాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ పోషకాలు లేకుండా ఆహారం తీసుకుంటే రక్తహీనత ఏర్పడుతుందన్నారు. అలాగే శిశువులు ఆరోగ్యానికి హాని కల్గే ప్రమాదం ఉందన్నారు.

- **పెద్దకడబూరు :** పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కాత్యాయిని, భాగ్యలక్ష్మిబాయి అన్నారు. బుధవారం కోసిగి మండల కేంద్రలోని అంగన్‌వాడీ 13వ సెంటర్‌లో పోషణ మాసోత్సవాన్ని జరుపుకున్నారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఎమ్మిగనూరురూరల్: గర్భిణి, బాలింతలకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నీలమ్మ, ప్రీతి అన్నారు. బుధవారం రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా మండల పరిధిలోని దైవందిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కోటేకల్ గ్రామాల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ పోషక విలువలు ఉండే ఆహారం తీసుకుంటే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు.

- **ఎమ్మిగనూరుటౌన్:** ఆకుకూరల్లో ఎన్నో పోషక విలువలుంటాయని, అదేవిధంగా పుట్టిన పిల్లలకు తల్లిపాలు ముఖ్యమని సీడీపీఓ సఫరున్నీసా బేగం, అర్బన్ వైద్యురాలు వీణ అన్నారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, తల్లులు, గర్భిణులతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఉల్లి పంట కాలం పూర్తయ్యాకే కోయాలి



నానో యూరియా మందులు చూపుతున్న ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి

ఎమ్మిగనూరురూరల్: రైతులు ఉల్లి పంట కాల వ్యవధి పూర్తి అయ్యాకే కోత కోయాలని ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏవో శివశంకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కందనాతి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ కోత రాక ముందే కోస్తే ఉల్లి సైజు తక్కువగా ఉండి గిట్టుబాటు ధర పకలదన్నారు. రైతులు ఈ విషయాన్ని గుర్తించుకొని పంట కాపు పూర్తిగా వచ్చాకే పీకాలని తెలిపారు. అధిక మోతాదులో రసాయన ఎరువులు వాడకం వలన భూసారం తగ్గిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. రైతులు మాములు యూరియా బదులుగా నానో యూరియాను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు రసూల్, వినోద్, వీఏఏలు కావ్య, షరీఫ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి



సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: విద్యారంగ, రైతులు,పేదల పక్షాన పోరాటం చేసిన మహానేత సీపీఐ నాయకుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. పట్టణంలోని మంజునాథ్ మినీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం పట్టణ కార్యదర్శి రంగన్న అధ్యక్షతన సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను నిర్వహించారు. ఈసభలో వారితో పాటు సీపీఎం నాయకుడు గోవిందు, కాంగ్రెస్ నాయకుడు ఖాశింవలి, టీడీపీ నాయకుడు ఆదెన్న, ఆర్కె కంటి వైద్య శాల అధినేత డాక్టర్ హేమంత్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు మల్లెల జీవన్, శ్రీనివాసులునాయుడు, తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో బుధవారం మంగమ్మ కాలువ గట్టు వద్ద పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.9400 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఇస్వీ ఎస్ఐ డాక్టర్ నాయక్ తెలిపారు. పెద్దహరివాణం గ్రామానికి చెందిన మర్రిస్వామి, తిప్పన్న, గర్జప్ప, రంగప్ప, ఈర్న, మాల ఈరన్న, జైమర్రిస్వామి, గిరిలను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు వెల్లడించారు.

కార్మిక హక్కుల సాధనకు ఉద్యమిద్దాం

ఆదోని రూరల్: కార్మికుల హక్కుల సాధనకై ఉద్యమిద్దామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.అంజిబాబు పిలుపునిచ్చారు. బుధవారం ఆదోని పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సీఐటీయూ 12వ మహాసభలు నిర్వహించారు. జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. నాయకులు రామాంజనేయులు, ఈరన్న, నీలకంఠ, శివ, రంగ, పెద్ద నాగరాజు, మనోహర్ పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి

నందవరం : మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబమంతా ఆరోగ్యకరంగా ఉంటుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు శ్రీలేఖ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యశాఖ ఆధ్వర్యంలో స్వస్థ నారీ, సశక్తి వంతమైన కుటుంబం అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంపై ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కాల్పించారు. ఆమె మాట్లాడుతూ..ప్రతి మహిళ ఆరోగ్యంగా, పరిశుభ్రంగా ఉండాలని, తనతో పాటు కుటంబాన్ని కూడా అదేవిధంగా ఉంచేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బలరాముడు, పీహెచ్ఎన్ మరియమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ సుశీలమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గురుశేఖరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ నియామకం

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా జిందే శారద, వైస్ చైర్మన్‌గా ఆదూరి విజయ్‌కృష్ణతో పాటు 18 మందిని సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఈనెల 15న జీవోను విడుదల చేసింది. ఇందులో బీజేపీ వారు 5 మందికి స్థానం లభించింది. వీరి ప్రమాణస్వీకారం నవరాత్రి రోజుల్లో ఉంటుందని యార్డు అధికారులు తెలిపారు.


తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఆదోని రూరల్: మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న, కార్యదర్శివర్గ సభ్యులు వీరారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం వారు ఎంపీడీఓ జనార్దన్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ మండలంలోని నెమలికల్ ఎస్ఎస ట్యాంకు నుంచి బసరకోడు వరకు అదనపు పైపులైన్ వేయాలన్నారు. కుప్పగల్ ఎస్ఎస ట్యాంకు నుంచి పాండవగల్లు వరకు అదనపు పైపులైన్, హనుమాన్ స్కీం వద్ద, కుప్పగల్ స్కీం దగ్గర ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాష, పాండురంగ, తాయన తిక్కన్న పాల్గొన్నారు.


పల్లె రోడ్లను పట్టించుకోండి సారూ!



కౌతాళం-బదినేహాల్ రోడ్డు.



హాల్వి రోడ్డులో కల్వర్టుకు పెట్టిన తాటమట్ట



మదిర-హాల్వి రోడ్డులో రోడ్డు అంత ఇలాంటి దృశ్యాలే

కౌతాళం: మండలంలో వివిధ ఆర్అండ్‌బీ రోడ్లతో పాటు కల్వర్టులు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటికి మరమ్మతులు ఎప్పుడు చేపడుతారు అంటూ ప్రశ్నిస్తున్నారు ఆయా గ్రామాల ప్రజలు. కౌతాళం నుంచి బదినేహాల్ వరకు ఉన్న రోడ్డు అడుగు తీసి అడుగు వేయలేనంతగా అన్న చందంగా ఉంది. చాల చోట్ల తారు పూర్తిగా పోయి మట్టిరోడ్డును తలపిస్తుంది. ఈ రోడ్డులో ఉన్న కల్వర్టులు నాల్గు చోట్ల పూర్తి కూలిపోవడంతో ఈ రహదారి గుండా పొలాలకు పోవాల్సిన రైతులే కూలిన కల్వర్టుల వద్ద గ్రావెల్ వేసుకుని తమ ఎద్దుల బండ్లను పొలాలకు పోవడానికి అనువుగా మార్చుకున్నారు. ఈ రోడ్డులో బస్సులు తిరగడం పూర్తిగా బంద్ అయ్యింది. ఇక మదిర నుంచి హాల్వి వరకు ఉన్న రోడ్డు సైతం ఇలాంటి పరస్థితే ఉంది. ఈ రెండు గ్రామాల మధ్య 7కిలో మీటర్ల రోడ్డు దాటలంటే అరగంట సమయం పడుతుంది. ఇక్కడ కూడా కల్వర్టుకు రంధ్రం పడడంతో ప్రయాణికులే తాటిమట్టను గుర్తుగా పెట్టారు.



బదినేహాల్ నుంచి కౌతాళం వరకు రోడ్డు దుస్థితి